TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 285 | గురువారం జూన్ 19 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5



## పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త విద్యుత్ ప్రాజెక్టు నిర్మించలేదు

▸ ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ కోసం రూ.13,992 కోట్లు చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

2లో..

## తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



2లో..

# ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

## జీ7 సదస్సులో ప్రధాని మోడీ స్పష్టీకరణ



ఉగ్రవాదం ఎక్కడున్నా, ఏ రూపంలో ఉన్నా అది మానవాళికి ప్రధాన శత్రువని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కెనడాలో జరిగిన జీ7 సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించుకుంటాయని హెచ్చరించారు. ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి మానవత్వంపై జరిగిన దాడిగా మోదీ అభివర్ణించారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదన్నారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టే అన్ని దేశాలు దీన్ని వ్యతిరేకించాలి. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, విధానాలు స్పష్టంగా ఉండాలి. ఏదైనా దేశం ఉగ్రవాదానికి మద్దతిస్తే అందుకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మోదీ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు అనిశ్చితి, సంఘర్షణలతో ఎక్కువగా బాధపడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక సంక్షోభాలతో ముందుగా దెబ్బతినేది వారేనన్నారు. గ్లోబల్ సౌత్‌లో నెలకొన్న ఆందోళనలు, ప్రాధాన్యతలను ప్రపంచ వేదికపై లేవనెత్తడాన్ని భారత్ తన బాధ్యతగా భావిస్తోందన్నారు. ఇక, ప్రధాని డీప్‌ఫేక్ గురించి కూడా మాట్లాడారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్న మోదీ.. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై వాటర్ మార్కింగ్ లేదా స్పష్టమైన గుర్తు ఉండాలన్నారు. ఈ శతాబ్దంలో సాంకేతికతపై పరస్పర సహకారం అవసరమన్నారు. కృత్రిమ మేధస్సు చుట్టూ ఉన్న ఆందోళనలను పరిష్కరించి, ఆవిష్కరణలు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన నేపథ్యంలో మోదీ కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో సహా పలువురు ప్రపంచ నాయకులను కలిశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్





2లో..

ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం.

- ▸ జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్
- ▸ డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని వెల్లడి
- ▸ తెలంగాణ రైజింగ్‌లో గూగుల్ తోడ్పాటు అవసరమన్న సిఎం

## బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ

### హైదరాబాద్ అనుకూలమనన్న సిఎం రేవంత్

హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని రేవంత్ వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ లో డిఫెన్స్ కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.




2లో..



## బీఆర్ఎస్ హయాంలోనే బనకచర్లకు క్లియరెన్స్.. జగన్ ప్రపోజల్ కు కేసీఆర్ అప్రూవల్

2లో..

బనకచర్ల ప్రాజెక్ట్ పై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే బనకచర్లకు క్లియరెన్స్ ఇచ్చారని చెప్పారు అర్వింద్. జగన్ ప్రపోజల్ మేరకే కేసీఆర్ ఆమోదం తెలిపారని అన్నారు. హామీల వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. కేసీఆర్ డైరెక్షన్ లో తెలంగాణ సెంటిమెంట్ ను రెచ్చగొట్టడానికి. ఇపుడు కాంగ్రెస్ కూడా డైవర్షన్ పాలిటిక్స్ కోసం బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని చెప్పారు.

# మూడో రోజు..

## 4 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ కొనసాగుతోంది. మూడో రోజు ఇవాళ 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది.

2లో..

# సంపాదకీయం

## ఇంటా బయటా నాయకత్వ శూన్యతే

ప్రపంచ రాజకీయాల్లో నాయకత్వ శూన్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అణు కార్యక్రమాన్ని చేపడుతోందన్న పేరుతో ఇరాన్‌పై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ దుస్సాహసానికి అడ్డుకట్ట వేసేవారు కనపడడం లేదు. ఇజ్రాయెల్ చెబుతున్నట్లు అమెరికా వింటోందా, లేక అమెరికా చెప్పినట్లు ఇజ్రాయెల్ నడుచుకుంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇజ్రాయెల్‌లో పదవి కోల్పోయే పరిస్థితిలో ఉన్న సమయంలో హమాస్‌పై దాడులు చేసి తన రాజకీయ అధికారాన్ని నిలుపుకున్న నెతన్యాహు ఇప్పుడు తన మనుగడకోసం ఇరాన్‌లో విధ్వంసానికి పూనుకుంటున్నాడు. గతంలో ఇజ్రాయెల్ ఇలాంటి దాడులకు పాల్పడినప్పుడు అమెరికా అడ్డుకట్ట వేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పే మాటలు వినేవారెవరూ కనపడడం లేదు. ఐక్యరాజ్య సమితి ఒక నామమాత్ర సంస్థగా మారిపోయింది. నిజానికి ప్రపంచంలో అనేక దేశాలు అణ్వస్త్ర తయారీ కార్యక్రమాలను చేపట్టినప్పుడు ఏ దేశమూ మరో దేశాన్ని ఆపలేకపోయింది. ప్రస్తుత విదేశాంగమంత్రి జైశంకర్ తండ్రి, జాతీయ భద్రతా సలహా బోర్డు చైర్మన్‌గా ఉన్న రక్షణ వ్యూహ నిపుణుడు కె. సుబ్రహ్మణ్యం సలహా మేరకు భారతదేశం అణు పరీక్షలు చేపట్టిన తర్వాతే ఒక బలమైన దేశంగా రూపొందింది. అణ్వస్త్ర దేశాల శ్రేణిలో చేరినప్పుడే భారత్ ఒక బలమైన శక్తిగా మారుతుందని దీనివల్ల మనం ప్రత్యర్థులను నిలువరించగలుగుతామని సుబ్రహ్మణ్యం ఇచ్చిన సలహా అత్యంత విలువైనది. పలు దేశాలు అణు శక్తులుగా మారినప్పుడే ఒక సమతుల్యత ఏర్పడుతుందన్న అభిప్రాయానికి అన్ని దేశాలూ వచ్చాయి. అయితే ఇరాన్ అణ్వస్త్ర తయారీ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ఆ దేశంలో రక్తపాతానికి పూనుకున్నది. ప్రపంచంలో ఏ దేశమూ ఇజ్రాయెల్‌ను ఆపలేని పరిస్థితిలో ఉన్నది. ఈ యుద్ధం ఎన్నాళ్లు కొనసాగుతుందో. ఇది ఏ పర్యవసానాలకు దారితీస్తుందో చెప్పలేము. రష్యా, చైనా, ఇస్లామిక్ దేశాల కదలికలను కూడా ప్రపంచం ఆసక్తితో గమనిస్తోంది. అమెరికా ఈ యుద్ధ నివారణలో విఫలమైతే ప్రపంచ రాజకీయాల్లో నాయకత్వ పాత్రను పూర్తిగా కోల్పోక తప్పదు. ఈ వ్యవహారంలో భారతదేశం ప్రేక్షక పాత్ర వహించక తప్పడం లేదు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇజ్రాయెల్‌తో స్నేహం చేస్తూనే పాలస్తీనా ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నించారు.

పాలస్తీనా విమోచనోద్యమనేత అరాఫత్‌ను భారత్‌కు అహ్వానించారు. మన విలువలకు, ప్రయోజనాలకు మధ్య ఐక్యత సాధించినప్పుడే మన విదేశాంగ విధానం విజయవంతమవుతుంది. ఇజ్రాయెల్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేసినంత మాత్రాన ఆ దేశ పద్ధతులను మనం సమర్థించాలని ఎక్కడా లేదు. ప్రధాని మోదీ ప్రభావదాయక దేశాలతో స్నేహం చేసి భారత్‌ను ఒక అగ్రగామి శక్తిగా మార్చేందుకు శాయశక్తులా కృషి చేశారు. ప్రపంచ రాజకీయాల్లో ఒక నిర్ణాయక శక్తిగా మారేందుకు మనకు ఎన్నో అవకాశాలున్నాయి. 140 కోట్ల మంది వినియోగదారులతో బలమైన మార్కెట్ శక్తిగా అవతరించిన భారతదేశం ప్రపంచ రాజకీయాల్లో ఒక నిర్దిష్ట పాత్ర పోషించగల స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉన్నది. విచిత్రమేమంటే అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం తర్వాత భారత రాజకీయాలు ఎందుకో స్తబ్ధంగా మారినట్లు కనిపిస్తున్నాయి. నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనపై బీజేపీ విజయోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ దుర్ఘటన సంభవించడంతో పార్టీ నేతల ఉత్సాహం నీరు కారినట్లయింది. ఆ తర్వాత మోదీ సైప్రస్‌తో పాటు మూడు దేశాల పర్యటనకు బయలు దేరితే ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ యూరప్‌లో ఏదో దేశానికి వ్యక్తిగత పర్యటన నిమిత్తం వెళ్లారు. రాహుల్ పార్టీ అధ్యక్షుడు కాకపోయినా ఆయన లేకపోతే కాంగ్రెస్ పార్టీలో స్తబ్ధత కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఆయన సోదరి ప్రియాంకాగాంధీ కేరళలో ఉప ఎన్నికల్లో తలమునకలై ఉన్నారు. భారతీయ జనతా పార్టీలోనూ, కాంగ్రెస్ పార్టీలోనూ చాలా నిర్ణయాలు పెండింగ్‌లో పడినట్లు ఆ పార్టీల నేతలు చెబుతున్నారు. బీజేపీకి సంబంధించి కొన్ని రాష్ట్రాల అధ్యక్షులతో పాటు జాతీయ అధ్యక్షుడు, పార్టీ ఆఫీసుబేరర్ల నియామకం ఎప్పుడు జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. కాంగ్రెస్ విషయానికి వస్తే కర్ణాటకలో నామినేటెడ్ ఎమ్మెల్సీలకు అభ్యర్థుల ఎంపిక నుంచి రాష్ట్రాల్లో పార్టీని పటిష్ఠం చేసే కార్యక్రమం కూడా పెండింగ్‌లో పడ్డట్లు కనపడుతోంది. ఈ రెండు జాతీయ పార్టీల ప్రధాన కార్యాలయాల్లో నేతల కదలికలు పెద్దగా లేవు. ఇదిలావుంటే భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నదని నేతలు చేస్తున్న ప్రకటనలు ఒక ఉత్సాహాన్ని కలుగచేస్తున్నాయి. భారత్ త్వరలో ప్రపంచ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైప్రస్‌లో వ్యాపారవేత్తలతో మాట్లాడుతూ ప్రకటించారు.

సరిగ్గా నెల రోజుల క్రితం భారతదేశం జపాన్‌ను అధిగమించి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. అమెరికా, చైనా, జర్మనీల తర్వాతి స్థానం భారత్‌దే అని ఆయన అన్నారు. మన దేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారితే అంతకంటే కావల్సింది ఏముంటుంది? నిజంగా 4,186.43 బిలియన్ డాలర్ల జపాన్ జీడీపీతో పోలిస్తే 4,187,03 బిలియన్ డాలర్ల జీడీపీని సాధించిన భారతదేశం ఘనతను కాదనలేము. మరో మూడేళ్లలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి పూర్తిగా వికసిత్ భారత్‌గా భారత్ అవతరిస్తుందనే ప్రకటనలనూ కొట్టి పారేయలేము. గత 11 సంవత్సరాల్లో దేశంలో జరిగిన రహదారులు, రేవులు, విమానాశ్రయాల నిర్మాణం, డిజిటలీకరణ వంటి సాంకేతిక అభివృద్ధి, పెరుగుతున్న వినియోగదారుల సంఖ్య, ఉత్పాదక, సేవల రంగాల విస్తృతి కూడా చెప్పుకోదగ్గది. భారతదేశం అనేక రాష్ట్రాల సముదాయం కనుక మన దేశంలో అభివృద్ధి సమానంగా ఉండదు. రాష్ట్రాల రెవిన్యూ వసూళ్లు, స్వంత పన్నుల సేకరణ చెప్పుకోదగ్గ విధంగా లేవు. అయినప్పటికీ జీడీపీ పెరుగుదల 6%-%7 శాతం మధ్య ఉంటూ వేగంగా పెరుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు పొందింది. కానీ ఈ పెరుగుదల 8%-%9 శాతం మధ్య ఉన్నప్పుడే మనం లక్ష్యాలకు చేరుకోగలం. అయినా ఒక దేశంలో జరుగుతున్న అభివృద్ధికి ఆ జీడీపీ కొలమానమా అన్నప్రశ్న ఎంతో విలువైనది. ఎందుకంటే జీడీపీకి ప్రజల బాగుగోగులకూ పెద్దగా సంబంధం ఉండదు. కొనుగోలు శక్తి రీత్యా భారత జీడీపీ ఇప్పటికే 15వేల బిలియన్ డాలర్లకు చేరుకుందని నీతి ఆయోగ్ ప్రకటించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతగా జరుగుతున్నా, దేశ శ్రామిక జనులలో 76 శాతం మంది వ్యవసాయ రంగంలోనూ, అసంఘటిత రంగంలోనూ దినసరి కూలీలుగా చాలీచాలని వేతనాలతో జీవితం గడుపుతున్న విషయం అందరికీ తెలిసిందే.

అందువల్ల ఎవరి కొనుగోలు శక్తిని జీడీపీకి కొలమానంగా తీసుకుంటున్నామన్న విషయం చర్చనీయాంశం. అంతేకాదు, మన దేశంలో ప్రపంచంలో అతిపెద్ద జనాభా రీత్యా మనం చెప్పుకుంటున్న జీడీపీని జనాభా ప్రకారం విభజిస్తే మన తలసరి జీడీపీ శ్రీలంక, భూటాన్, వియత్నాం, కెన్యా, మొరాకో, లిబియా, మారిషస్, దక్షిణాఫ్రికా తదితర దేశాల కంటే తక్కువే ఉన్నదన్న విషయాన్ని కూడా విస్మరించలేం. జీడీపీ రీత్యా భారత్‌ను నాల్గవ అతిపెద్ద దేశంగా పరిగణిస్తే తలసరి జీడీపీ రీత్యా మన దేశం 196 దేశాల్లో 127వ స్థానంలో ఉన్నదన్నది ఒక పచ్చి వాస్తవం. నిజానికి జపాన్‌ను మనం జీడీపీలో అధిగమించాము కానీ జపాన్ తలసరి ఆదాయం భారత్ తలసరి ఆదాయం కంటే 11.8 రెట్లు ఎక్కువ ఉంటుందని ఐఎంఎఫ్ తాజా అంచనా.

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

మొదటిపేజీ తరువాయి

ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందని ఈ సందర్భంగా అన్నారు.. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారాలన్న లక్షయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నాం అన్నారు. ఇక్కడి మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారు. ప్రభుత్వంలో నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చాం'అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రపంచంలో ఐదవది మాత్రమే అని తెలిపారు. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయిందని.. నేడు మన జీవితాలు పూర్తిగా డిజిటల్‌గా మారాయన్నారు. గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామని తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్‌గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతామని చెప్పుకొచ్చారు.

అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగి స్తున్నందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందన్నారు. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్దాంతమని.. ఈ విధానాన్ని తాను ఇష్టపడుతున్నట్లు తెలిపారు. గూగుల్‌లా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నానన్నారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయని.. అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టిపెట్టి పనిచేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడికి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుందన్నారు. సెర్చ్‌లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుందని సీఎం రేవంత్ అన్నారు. దీనిని




తెలంగాణ రైజింగ్ అని పిలుస్తామని... 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. గూగుల్ ఆఫీస్ పక్కన రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశామని.. రైతులను సంపన్నులుగా తయారు చేయడంతో పాటు సంతోషంగా ఉంచాలను కుంటున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అందుకు గూగుల్ మద్దతు కావాలని.. తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా కావాలని కోరుకుంటున్నామన్నారు. గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులన్నారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నా రన్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. గూగుల్ ఒక వినూత్న సంస్థ, తమది ఒక వినూత్న ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించినట్లు చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వాలు ట్రాన్సజెండర్స్‌ని నిర్లక్ష్యం చేశాయన్నారు. జీహెచ్‌ఎంసీ కూడా వివిధ పనుల కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించుకుంటోందన్నారు. నాణ్యమైన విద్య తమ లక్ష్యమని.. ఇందుకోసం యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకువస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రతీ సంవత్సరం 1.10 లక్షల ఇంజనీర్స్ కాలేజ్‌ల నుంచి వస్తున్నారని... చాలా మంది విద్యార్థులకు నైపుణ్యం ఉండడం లేదన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరికీ ఆరోగ్యం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇవే తన ప్రధాన ఆవిష్కరణలన్నారు. 'గూగుల్ లాగానే, నా ప్రభుత్వంలో భాగస్వాములైన మహిళలు, యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి, సీనియర్ సిటిజన్లు, పిల్లలకు ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరుకుంటున్నాను. మనం కలిసి గొప్ప ప్రమాణాలను సృష్టిద్దాం. హైదరాబాద్‌లో మీ కొత్త సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు మరోసారి అభినందిస్తున్నాను. మేం గర్వపడేలా మీరు పనిచేస్తారని విశ్వసిస్తున్నాను' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత గూగుల్ మొదలుపెట్టిన రెండో సెంటర్ ఇది. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఇది ఐదవది కావడం గమనార్హం. గతేడాది ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి, హైదరాబాద్‌లో ఈ సెంటర్ ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రతా వ్యవస్థలు, ఆన్‌లైన్ సేఫ్టీ టూల్స్‌ను అభివృద్ధి చేయడంలో ఇది కీలకంగా పనిచేయనుంది. ప్రపంచ నిపుణులు, పరిశోధకులు ఇందులో భాగమవుతారు. ఈ కేంద్రం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర యువతకు లభించే అవకాశముంది. ఐటీ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకుపోతుందన్నది ఈ అభివృద్ధి సంకేతం.

## పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త విద్యుత్ ప్రాజెక్టు నిర్మించలేదు

మొదటిపేజీ తరువాయి

ఖమ్మం: ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ కోసం రూ.13,992 కోట్లు చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన విద్యుత్ అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. వరదల సమయంలో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు ప్రాణాలకు తెగించి పనిచేశారని అభినందించారు. పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త విద్యుత్ ప్రాజెక్టు నిర్మించలేదని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టుల ద్వారానే విద్యుత్ సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు.

## మూడో రోజు..

### 4 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు: మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ కొనసాగుతోంది. మూడో రోజు ఇవాళ 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. మరో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.5215.26 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసి 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించినట్లైంది. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతుభరోసా నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసా విషయంలో భారాస నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదన్నారు.

"గతంలో భారాస ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయింది. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నాం. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వదిలేస్తే.. మేం అధికారంలోకి రాగానే ఆ నిధులు కూడా చెల్లించాం. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. సీఎం ఇచ్చిన హామీ మేరకు వానాకాలం రైతుభరోసా నిధులు జమ చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా 9 రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికైనా భారాస నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి. లేదంటే రైతాంగం ఎప్పటికీ క్షమించదు"అని మంత్రి తుమ్మల అన్నారు.

## బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ

మొదటిపేజీ తరువాయి

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ / సీఈవో డా, జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీ.ఏ. శ్రీనివాస మూర్తి, తదితరులు సీఎంతో భేటీ అయ్యారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని చెప్పారు.బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ, హైదరాబాద్‌ను ఎంచుకోవాలని, ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం వాదనలపై బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించింది. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే బనకచర్లకు క్లియరెన్స్ : ఎంపీ అర్వింద్

మొదటిపేజీ తరువాయి

బనకచర్ల వల్ల తెలంగాణ జరిగే నష్టం ఎంతో ఉత్తమ్ కు తెల్వదన్నారు. ఉత్తమ్..సగం కాంగ్రెస్..సగం బీఆర్ఎస్ అని ధ్వజమెత్తారు. ఉత్తమ్ పీసీసీ చీఫ్ గా ఉన్నప్పుడు కేసీఆర్ చెప్పిన వాళ్లకే టికెట్ ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ బీజేపీపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం నాటకాలాడుతున్నారని విమర్శించారు అర్వింద్.

ఆల్ పార్టీ ఎంపీల సమావేశంలో కూడా ఏమి ఉండదన్నారు. తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఉత్తమ్ కు అవగాహన లేదన్నారు. ఎన్ని టీఎంసీలు అవసరం, ప్రాజెక్టుల వ్యయం ఎంత అనేది తెల్వదన్నారు. ఓ వైపు సీఎం రేవంత్ రెడ్డి డబ్బుల్లేవంటారని..ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతారని విమర్శించారు. ఏపీ,తెలంగాణ మధ్య ముదురుతోన్న బనకచర్ల వివాదంపై తెలంగాణ ప్రభుత్వం ఆల్ పార్టీ ఎంపీలతో సమావేశం అయ్యింది. బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నారు ఉత్తమ్. బీఆర్ఎస్, బీజేపీ,ఎంఐఎం,కాంగ్రెస్ నుంచి పలువురు రాజ్యసభ, లోక్ సభ ఎంపీలు హాజరయ్యారు.

## తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అఖిలపక్ష ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో పాటు, భాజపా ఎంపీలు డీకే ఆరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. "గోదావరి-బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరి-బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది" అని వివరించారు.

# వన మహోత్సవం లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి





**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
వన మహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీ.ఎఫ్.ఓ వికాస్ మీనాలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా 2025 - 2026 వార్షిక సంవత్సరానికి ఆయా శాఖల వారీగా వన మహోత్సవం కింద నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించారు. ఆయా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో సాధించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 545 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ పట్టణాలలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. వన మహోత్సవంను ప్రాధాన్యత అంశంగా భావిస్తూ, నిర్ణీత గడువు లోపు లక్ష్యం పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లతో సన్నద్ధం అయి ఉండాలన్నారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు, సూపర్వైజరీ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా నర్సరీలను, వైకుంఠధామాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాలని అన్నారు. నాటిన మొక్కల స్థితిగతులను తప్పనిసరిగా పరిశీలన చేయాలని, వన మహోత్సవం అమలు తీరును పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. నాటిన మొక్కలు ఏ స్థితిలో ఉన్నాయన్నది తెలియజేస్తూ వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు ప్రతి గ్రామ పంచాయతీని విధిగా సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించాలన్నారు. ఎక్కడైనా మొక్కలు ఎండిపోయి ఆనవాళ్లు కోల్పోతే, అందుకు గల కారణాలను అన్వేషించాలని, ఆ తప్పిదాలు మళ్ళీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలను నాటాలని అన్నారు. గత సంవత్సరం మొక్కలు నాటిన ప్రదేశాలతో పాటు, ప్రస్తుత సంవత్సరంలో మొక్కలు నాటనున్న ప్రాంతాలలో తప్పనిసరిగా వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పచ్చదనాన్ని పెంపొందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అప్పుడే వన మహోత్సవం లక్ష్యం సిద్ధిస్తుందని అన్నారు. కేవలం గుంతలు తవ్వి, మొక్కలు నాటి, వాటికి నీటిని అందించడంతోనే సరిపెట్టుకోకుండా, సాసరింగ్, ఫెన్సింగ్, మొక్కలకు సపోర్ట్ కర్రలను అమర్చడం వంటి వాటిపై కూడా దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. మొక్కల పెంపకం కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులు, కాంపోనెంట్ లను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఉపాధి హామీ కూలీలకు పని దినాలు ఎక్కువ మొత్తంలో లభించడమే కాకుండా గ్రామ పంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. బ్లాక్ ప్లాంటేషన్ కు ప్రాధాన్యత ఇవ్వాలని, వచ్చే 2026 లో చేపట్టే వన మహోత్సవం కోసం ఇప్పటి నుండే నర్సరీలలో మొక్కల పెంపకం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నవంబర్ నెల నాటికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కూడా నర్సరీ నిర్వహణ చేపట్టాలని కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. వన మహోత్సవం అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా అంకిత భావం, సమన్వయంతో పని చేస్తూ నిర్ణీత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. సమీక్షా సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగా భూమి లావాదేవీలు జరిగిన వారు

**- తమ యొక్క ఖాతాలు మండల వ్యవసాయ అధికారి ఆఫీసులో సమర్పించండి**

**నారాయణపేట ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోసిగి మండలం మండల వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణ విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రైతు భరోసా పెట్టుబడి సహాయం నగదు బదిలీ బ్యాంకు ఖాతాల గురించి కోస్గి మండలంలో మొత్తం 13,331 అర్హులైన రైతులకు గాను 11,999 మంది రైతులు తమ యొక్క అకౌంట్ డీటెయిల్స్ వ్యవసాయ శాఖకు సమర్పించారు, అందులో ఈ రోజు వరకు 9, 191 మంది రైతుల ఖాతాలలో ఆరు కోట్ల తొంబై రెండు లక్షల ఇరవై ఏడువేల తొమ్మిది వందల నలభై ఒక్క రూపాయలు (? 6,92,27,941) పెట్టుబడి సహాయం కింద జమచేయబడ్డాయి. మిగిలిన వారి ఖాతాలలో కూడా నగదు బదిలీ కొనసాగుతుంది. ఇంకా మండలం లో 1332 మంది రైతులు తమ యొక్క బ్యాంకు ఖాతాలను సమర్పించవలసి ఉన్నది కావున వారు కూడా తమ యొక్క వ్యవసాయ విస్తీర్ణ అధికారిని సంప్రదించి ఈ నెల 20 తేదీలోపు తమ యొక్క బ్యాంకు ఖాతాలను సమర్పించి రైతు భరోసా పొందవలసిందిగా కోరుచున్నామని రైతులు ఎవరు ఆధర్య పడవద్ద ని రేపు అనగా గురువారం నాలుగు నుంచి ఐదు ఎకరాలు ఉన్న రైతులందరికీ రైతుబంధు డబ్బులు జమవుతాయని ఈ సందర్భంగా తెలిపారు



# ఆర్ఎంపి పై దాడి కుట్రలో భాగమే

**- మీడియా సమావేశంలోజిల్లా ఆర్ఎంపి, పిఎంపిల నాయకుల వెల్లడి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ర్యాలీలో జరిగిన దాడి సంఘటన కుట్రలో భాగమేనని ఆర్.ఎం.పి,పి.ఎం.పి ల నాయకులు ఆరోపించారు. బుధవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన శాంతియుతంగా నిర్వహిస్తున్నా ర్యాలీలో జరిగిన సంఘటన తమకు ఆందోళన కలిగించింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 429 జీవో ప్రకారం గ్రామీణ వైద్యులకు శిక్షణ కల్పించి వైద్యులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపీ పి ఏం పిలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమలోని ఐక్యతను చూసి ఓర్వలేని కొందరు శాంతియుతంగా చేస్తున్నా ర్యాలీని భగ్నం చేసేందుకు కుట్రపూరితంగా కొందరు




నాయకులు మహిళను రెచ్చగొట్టి తమ పైకి ఉసిగొల్పారని ఆరోపించారు. డిచ్ పల్లి మండల కేంద్రంలో ఆర్ఎంపీ వైద్యుడుగా కొనసాగుతున్న అశోక్ పై మహిళ దాడి చేయడం హేయమైన చర్యని తాము ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తామంతా డాక్టర్ అశోక్ కు మద్దతుగా జిల్లా సీపీకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో బోధన్ ఆర్ఎంపీ, పిఎంపిల అధ్యక్షులు రాజా గోపాల్ చారి, ఆర్మూర్ శ్రీనివాస్, చందు, సాయిలు, ఖలీల్,అజార్, మోస్రా గంగారెడ్డి, బొద్దుల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి





**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
జిల్లాలో చేపట్టే రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ వీసీ కాన్ఫరెన్స్ హాల్ లో రోడ్ల విస్తరణ, రైల్వే పనులు, నీటి పారుదల, జాతీయ రహదారులు, పరిశ్రమల స్థాపన తదితర వాటికి అవసరమైన భూసేకరణపై సంబంధిత అధికారులతో శాఖల వారీగా కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత పనుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, భూసేకరణపై పెండింగ్ లో ఉన్న అప్పీల్ లను వేగంగా పరిష్కరించాలని అన్నారు. వారం అనంతరం భూసేకరణపై మళ్ళీ సమీక్ష చేస్తామని, స్పష్టమైన ప్రగతి కనిపించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, మెప్మా పీ.డీ రాజేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు భాస్కర్, రైల్వే, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్, టీజీఐఐసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ

**కొడంగల్ (మన వెలుగు) జూన్ 18:**
కొడంగల్ నియోజకవర్గంలో దౌలతాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈరోజు విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే ఉన్నత విజయాలను సాధించారని, మీరు కూడా దౌల్తాబాద్ ప్రభుత్వ కళాశాలలో చేరి శ్రద్ధగా చదివి, ఉన్నత విజయాలు సాధించాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం మన మండలంలో జూనియర్ కళాశాల మంజూరు చేసి, అనుభవజ్ఞులైన 12 మంది అధ్యాపకులను నియమించడం జరిగింది. కావున స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలను మన కళాశాలలోనే చేర్పించవలసిందిగా సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌలతాబాద్ లో ఎంపీసీ, బైపీసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపులకు సంబంధించి ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తను ప్రత్యేకంగా చొరవ తీసుకొని కళాశాల అభివృద్ధికి, పిల్లల ఉన్నతమైన భవిష్యత్తు కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి శంకర్ నాయక్, కొడంగల్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహరెడ్డి , ఎంఈఓ వెంకటస్వామి, దౌల్తాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ హరిరెడ్డి , రిటైర్డ్ హెడ్మాస్టర్ ప్రభాకర్ సార్, స్థానిక నాయకులు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు సాయిల్ సార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అడ్మిషన్ల్లు,తరగతుల పై దృష్టి సారించండి

**- ప్రిన్సిపాల్ ల సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
ఇంటర్మీడియట్ నూతన విద్య సంవత్సరం (2025-26) ప్రారంభమైనందున రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు ముందుగా మొదటి సంవత్సరం అడ్మిషన్లపై దృష్టి సారించడంతో పాటు రెండవ సంవత్సరం విద్యార్థుల తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. బుధవారం జిల్లా ఇంటర్ విద్య అధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య అధికారి మాట్లాడుతూ గత సప్లమెంటరీ పరీక్షలలో సాధించిన ఫలితాల ను కళాశాల వారీగా సమీక్షించారు. అలాగే ప్రతి విద్యా సంవత్సరం కంటే ఈసారి కమిషనర్ ఆదేశం మేరకు అడ్మిషన్ల సంఖ్య 25% పెంచాలని ఆదేశించారు.విద్యా సంవత్సరం ప్రారంభం నుండే రెండవ సంవత్సరం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కళాశాల అధ్యాపకుల సమయపాలన, హాజరు, పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. కళాశాలలో అవసరమైన మరమ్మతులు , పాఠ్యపుస్తకాల పంపిణీ, ప్రయోగశాల ల నిర్వహణ కు సంబంధించి పూర్తి వివరాలతో తెలియజేయాలని సూచించారు. ఫలితాలు తక్కువగా సాధించిన కళాశాలలో ప్రిన్సిపల్ లు మొదటి నుండి ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే ఐ.ఎఫ్.ఎం.ఎస్. ఉద్యోగుల సంబంధించి కార్యాలయ నిర్వహణ వ్యవహారాలపై ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు పనిచేయాలని సూచించారు.



# కిసాన్ మోర్చ జిల్లా కార్యవర్గ సమావేశం





**- ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
నిజామాబాద్ నగరంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ నిజామాబాద్ పసుపు రైతులకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. పసుపు బోర్డు ఏర్పాటు చేయడమే కాకుండా పసుపు బోర్డుకు జాతీయ చైర్మన్ ని కూడా మన నిజామాబాద్ జిల్లా రైతు కుటుంబానికి చెందిన పల్లె గంగారెడ్డి చైర్మన్ గా నియమించడం జరిగింది. అంతేకాకుండా పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని కూడా నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క కేంద్ర కార్యాలయాన్ని ఈనెల చివరిన కేంద్ర హెూంశాఖ అమిత్ షా ప్రారంభించడం జరుగుతుంది. నిజామాబాద్ జిల్లా రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పసుపు బోర్డు కేంద్ర కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలి. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు ఏర్పాటుచేసి, కేంద్ర కార్యాలయాన్ని కూడా నిజామాబాద్ జిల్లాలో కేటాయించేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్నటువంటి అమిత్ షా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపేందుకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసిబీ కి చిక్కిన విద్యుత్ శాఖ ఎస్ ఈ

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్18 :**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ నరేష్ ఏసీబీకి పట్టుబడ్డాడు గుత్తేదారు నుంచి డబ్బులు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయాడు ఇంట్లో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు రాష్ట్రంలో ఏసీబీ అధికారులు దూకుడు పెంచడంతో అవినీతి తిమింగలాలకు దడ పుట్టిస్తున్నారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నీహస్తినాపురం కాలనీలో విద్యుత్అధికారిఒక ప్రైవేట్ కాంట్రాక్టర్ నుండి డబ్బులు డిమాండ్ చేయడంతో 80000 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. లంచానికి మరిగి అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన సమాచారంతో ఇంట్లో పలు డాక్యుమెంట్లు, ఆస్తుల వివరాలను తనిఖీ చేస్తున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి వుంది



## జిల్లా కలెక్టర్ ను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
ఇందూర్ జిల్లా కలెక్టర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన టి. వినయ్ కృష్ణ రెడ్డిని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా స్థితిగతులపై చర్చిస్తూ ఇందూర్ నగరం అభివృద్ధిపైన ప్రత్యేక ద్రుష్టి సరించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలియజేసారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీలకు అతితంగా తన సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే తెలియజేసారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మినారాయణ,ప్రభాకర్, ఆనంద్, పవన్ ముందద, మరవర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మనో సంకల్పంతో అంగవైకల్యాన్ని జయించాలి

**- విద్య ఒక్కటే విద్యార్థుల జీవితాలను తీర్చి దిద్దుతుందని**

**- అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18**
స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో
న్యూ అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన వికలాంగుల బడి బాట కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు వికలాంగుల బడి బాట కార్యక్రమంతో అంగవైకల్యం ఉన్న విద్యార్థులలో, తల్లితండ్రులలో మనో శక్తి పెంపొందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్నేహ సొసైటీ వారిని అభినందించారు. శరీరానికి ఉన్న అంగవైకల్యాన్ని మనో సంకల్పంతో




జయించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్య ఒక్కటే విద్యార్థుల జీవితాలను తీర్చి దిద్దుతుందని అన్నారు. విద్యతో పాటు వివిధ రంగాలలో ఉన్నత శిఖరాలను సాధించిన సుధా చంద్రన్, లూయి బ్రెయిల్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య %ఆ% ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి అంగవైకల్యం ఉన్న విద్యార్థులకు సదరం క్యాంపు ఏర్పాటు చేసి వారికీ సర్టిఫికెట్ అందేల చూస్తానని దాని ద్వారా దివ్యాంగులు ప్రభుత్వ పథకాలు, రాయితీల ప్రయోజనాలను పొందవచ్చు




అని అన్నారు. ప్రభుత్వం నుండి, తన సొంత ట్రస్ట్ ద్వారా ఎల్లప్పుడూ సహాయాసహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ చైర్మన్ సిద్దయ, ప్రిన్సిపాల్ జోతి, సీడీపీఓ సౌందర్య, స్నేహ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ వీరేషం, ల్ పీసీ చైర్మన్ బాబా గౌడ్, వైస్ చైర్మన్ జీవన్ రావు, ఆర్ ఎం ఓ డాక్టర్ హుమేర బేగం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**- టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**

**- సానుకూలంగా స్పందించిన కలెక్టర్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18**
జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) ప్రతినిధులు కలెక్టర్ టీ వినయ్ కృష్ణ రెడ్డిని కోరారు. జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించగా బుధవారం టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇండ్లు, ఇళ్ల స్థలాల అంశంపై జర్నలిస్ట్ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏం భాస్కర్ ఏ రామచందర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా మండలాలు, జిల్లా



కేంద్రంలో జర్నలిస్టులు సుదీర్ఘకాలంగా ఇండ్లు, ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో బతికీడుస్తున్న జర్నలిస్టులకు... అద్దెలు ఆర్థిక భారంగా మారుతున్నాయని వివరించారు. జర్నలిస్టుల కోసం గతంలో గుండారం శివారులో స్థల పరిశీలన జరిగినా.. ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని వాపోయారు. ఈ అంశంపై కలెక్టర్ టీ వినయ్ కృష్ణరెడ్డి



సానుకూలంగా స్పందించారు. ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఇళ్ల స్థలాల పంపిణీలో సాంకేతిక, రాజకీయ సమస్యలు లేకుండా పరిష్కారం లభించేలా చొరవ చూపుతానన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె వెంకటేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అనిత, పరమేశ్వర్, ప్రతినిధులు మధు, రాజు, నరేష్, వినీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైమ్ ది స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్'కి అనుమతి లేదు

**- డీఈవో అశోక్ ఓ తెలిపారు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18:**
నిజామాబాద్ నార్త్ మండలంలోని ఇస్లాంపురాలో ఉన్న ప్రైమ్ ది (ప్రైమ్ ది స్కూల్ అఫ్ ఎక్సెలెన్స్) ఉన్నత తరగతులకు (8 నుంచి 10వ తరగతి) ప్రభుత్వ అనుమతి లేదని నిజామాబాద్ డీఈవో అశోక్ ఓ ప్రకటనల లో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ


ప్రకటన తేది. 18.06.2025
ఇందు మూలముగా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా నిజామాబాద్ నార్త్ మండలంలోని ఇస్లాంపురలో ఉన్న ప్రైమ్ ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్నత తరగతుల (VIII-X) కు అనుమతి లేదు. అందు వలన తమ పిల్లలని జాయిన్ చేయవద్దు. అనుమతి ఉన్న పాఠశాల యందు జాయిన్ చేయగలరని కోరుచున్నాము. మరియు ఇతర పాఠశాలలోని [illegible] అనుమతి ఉంటేనే జాయిన్ చేయగలరని కోరుచున్నాము.
ఇట్లు
MEO Nizamabad North
MANDAL EDUCATIONAL OFFICER NIZAMABAD NORTH, NZB.

విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో ఏ పాఠశాలల్లోనైనా ప్రభుత్వ అనుమతి ఉంటేనే తమ పిల్లల్ని చదివించాలని సూచించారు. నిజామాబాద్ నగరంలోని పలు పాఠశాలలు ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రవేశాలు చేపట్టాయి. ఇలాంటి పాఠశాలల్లో అడ్మిషన్లు చేపట్టవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు డీఈవో సూచించారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ లు అందజేత



పరిగి మున్సిపల్ మొదటి వార్డు మల్లెమొనిగూడ గ్రామ వాసులకు డాక్టర్ టి .రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వారి ఆదేశాల మేరకు బుధవారం ఇందిరమ్మ ఇల్ల ప్రొసీడింగ్స్ ను అర్హులకు అందజేసిన వార్డ్ ఇంచార్జ్ ఆరిఫ్ పటేల్. వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మరో గ్యారంటీని పూర్తి చేస్తున్నట్లు సీఎం ఆదేశాల మేరకు రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వారి ఆదేశాల మేరకు ప్రొసీడింగ్స్ ఇచ్చామని ఆరిఫ్ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి మౌలానా, ఎండి అజ్మీర్, ఎండి. ఇస్మాయిల్ , ఎండి .ఖలీల్, ఎండి .బురాన్, ఎండి .రియాజ్, ఎండి .ఖయూమ్,పాండు , మల్లేష్ , ఎండి. హఫీజ్, ఎండి. జహంగీర్ పాల్గొన్నారు.

## అర్హులైన అభ్యర్థుల కు ఇందిరమ్మ ఇళ్లు-ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది- మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.శశికళ ఆనందం**





పరిగి పట్టణంలోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ లను అందించిన ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాఫీలను తీసుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,ఇళ్లు రానివారు బాధపడొద్దు, విడతలవారీగా అర్హులందరికీ ఇస్తాం అని, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాం రెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ ఆనందం, నాయకులు ఘనేముని శ్రీనివాస్,అభిరామ్ పంతులు, కోడంగల్ ఆనంద్, రొయ్యల కృష్ణయ్య , నర్సింలు,నరేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాల సదనం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ఆర్. ఆర్

పరిగి పట్టణ కేంద్రంలో రూ.84 లక్షలతో నిర్మించిన నూతన బాల సదనం భవనాన్ని పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు ,ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. మున్సిపాలిటీ లోని 2, 3,11, వార్డులలో ఎమ్మెల్యే నిధులతో నిర్మించినటువంటి సీసీ రోడ్డులను ఎమ్మెల్యే




రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. 11 వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డ పల్లి కృష్ణ ,ప్రజాపతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిసిన రూరల్ ఎమ్మెల్యే



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి గా నియమితులైన అనసూయ సీతక్క హైదరాబాదులోని మంత్రి క్యాంప్ ఆఫీసులో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి మర్యాదపూర్వకంగా మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా కప్పి సన్మానించడం జరిగింది. అనంతరం రూరల్ నియోజకవర్గం,నిజామాబాద్ జిల్లా గురించి,పార్టీ బలోపితం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇన్చార్జి మంత్రి అనసూయ సీతక్క నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి చర్చించడం జరిగింది.

# యజ్ఞమే నిజమైన కల్పవృక్షం

**- శ్రీ శ్రీ శ్రీధరానంద భారతీ స్వామి, శ్రీ శ్రీ శ్రీ వేద పునీతానంద స్వామీజీ**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
నిజామాబాద్ (ఇందూరు) జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ లోని వైదిక ధ్యాన యోగ కేంద్రం ఆశ్రమ వ్యవస్థాపకులు, ప్రముఖ కవి, రచయిత, చిత్రకారులు, మనో వైద్యులు, వేద పండితులు, ధర్మ ప్రచారకులు శ్రీశ్రీశ్రీ శ్రీధరానంద భారతీ స్వామి, అనువాదకులు, వైదిక ప్రవక్త, పురోహితులు, ధర్మ ప్రచారకులు శ్రీశ్రీశ్రీ వేద పునీతానంద స్వామి గార్ల ఆధ్వర్యంలో విశ్వశాంతి కొరకై నిర్వహిస్తున్న మహా యజ్ఞంలో భాగంగా 4వ రోజు బుధవారం ఉదయం యజ్ఞం నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి స్వామీజీలు మాట్లాడారు. శ్రీధరానంద భారతీ స్వామి, వేద పునీతానంద స్వామిజీలు యజ్ఞంలో పాల్గొన్న దంపతులు, భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేశారు. యజ్ఞం వలన మనశ్శాంతి కలుగుతుందని, ఆయుష్షు పెరుగుతుందని, ఆరోగ్యం కలుగుతుందని, దివ్య సంస్కారాలు కలుగుతాయని ఆధ్యాత్మిక ప్రసంగంలో అన్నారు. అంతేగాకుండా సకాలంలో వర్షాలు కురుస్తాయని, కాలుష్యం తొలగిపోయి రోగ క్రిములు నశిస్తాయి. అంటు రోగాలు తొలగిపోతాయి. మనుషుల మధ్య సామరస్యం ఏర్పడుతుంది. మానసిక ఒత్తిడి, చంచలత్వం, కుంగు బాటు, దౌర్భాల్యం మున్నగున్నవి తొలగిపోయి సంతానయోగ్యత పెరుగుతుందని అన్నారు. కీర్తి వర్ధిల్లుతుంది. ధన లాభం కలుగుతుంది. ముక్కోటి దేవతల అనుగ్రహం ప్రాప్తిస్తుంది. సర్వప్రాణులకు మేలు జరుగుతుంది. విశ్వశాంతి విస్తరిస్తుందని అన్నారు. ఈ బృహత్తరమైన యజ్ఞ కార్యంలో బద్దం రాజు భాయి - నర్సారెడ్డి, కంకణాల రాజేశ్వర్, పిట్టల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగారును ఉపసంహరించుకొని,ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**- సిపిఎం డిమాండ్**




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 18 :**
నిజామాబాద్ నగరంలోనిసిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, ఎస్ రమ హాజరయ్యారు.
ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యులు పి జ్యోతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని మావోయిస్టుల పెరుగుదలకు కారణమైన సమస్యలను పరిష్కరించి మావోయిస్టులు పెరగకుండా చూడాలని అంతేకానీ ఆపరేషన్ కగారు పేరుతో అమాయకులైన గిరిజనులను మావోయిస్టు అగ్ర నాయకులను చంపటం వలన ప్రజా సమస్యల పైన ప్రజలు చేయకుండా ఆపలేరని ఇది గ్రహించాలని ఆమె డిమాండ్ చేశారు. అదేవిధంగా కాశ్మీర్లో దాడిలో ఉగ్రవాదులను అరికట్టడంలో ప్రభుత్వం కాశ్మీర్ సమస్యలను పరిష్కారం పైన దృష్టి పెట్టి అమాయక ప్రజలను ప్రాణాలను తీసిన ఉగ్రవాదులను పట్టుకోవాలని ఈ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ప్రభుత్వాన్ని తమ గుప్పిట్లో తీసుకున్నట్టుగా మాట్లాడటం ప్రధానమంత్రి దానిపైన నోరు మెదపకపోవడం సరైనది కాదని ఆమె అన్నారు రాబోయే కాలంలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసుకోవడంతో పాటు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఇటీవల జరిగిన 24వ అఖిలభారత మహాసభలో నిర్ణయించటం జరిగిందని అందుకోసం పార్టీ కసరత్తు చేస్తుందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్ ,నాగన్న, జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, నన్నేసాబ్, కొండ గంగాధర్, సుజాత, జంగం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# ది రాజాసాబ్ ..ఓ ఎమోషనల్ స్టోరీ
# చిత్రకథపై దర్శకుడు మారుతి

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా సిద్ధమవుతోంది. ఈ సినిమా కథను ఉద్దేశించి దర్శకుడు మారుతి జాతీయ మీడియాతో మాట్లాడారు. ఇదొక ఎమోషనల్ స్టోరీ అని చెప్పారు. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారన్నారు. ఇలాంటి కాన్సెప్ట్ ఇండియన్ స్క్రీన్స్‌పై ఇప్పటివరకూ రాలేదన్నారు. 'ఇదొక ఎమోషనల్ ఫిల్మ్. ఎన్నో భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. తాతయ్య, నానమ్మ, మనవడి కథను ఇందులో చూపించనున్నాం. స్క్రీన్‌పై చూసిన తర్వాత ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారు' అని మారుతి తెలిపారు. 'హవేలి రాజ్‌మహల్' సెట్, వీఎఫ్ఎక్స్ వర్క్‌ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'ప్రభాస్ చిత్రాలకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, కథకు అనుగుణంగా భారీ సెట్స్ ఏర్పాటుచేశాం. వీఎఫ్ఎక్స్ విషయానికి వస్తే.. ప్రభాస్ సినిమాపై



ప్రేక్షకుల్లో ఒక అంచనా ఉంటుంది. దానికి తగ్గట్టుగా వీఎఫ్ఎక్స్ వర్క్‌పై దృష్టిపెట్టాను. అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. నిర్మాణ సంస్థ కూడా బడ్జెట్ విషయంలో ఎక్కడా వెనుకాడలేదు. ప్రేక్షకులను మేము మోసం చేయాలనుకోవడం లేదు. వాస్తవికతకు వీఎఫ్ఎక్స్‌ను జోడించాలనేదే మా ఉద్దేశం. పూర్తిస్థాయిలో ఒక అబద్ధపు ప్రపంచాన్ని సృష్టించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు' అని ఆయన చెప్పారు. సినిమా కోసం ప్రభాస్ ఎంతో శ్రమించారన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన చిత్రాన్ని అందించేందుకు ఆయన అన్నివిధాలుగా కష్టపడుతుంటారని వివరించారు.డిసెంబర్ 5న పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదలైంది. ప్రభాస్ వింటేజ్ లుక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సుమారు 3 గంటల నిడివితో ఇది విడుదల కానుందని టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో మారుతి తెలిపారు. 'రాజాసాబ్' కోసం నిర్మించిన హవేలి రాజ్‌మహల్ సెట్‌ను టీమ్ ఇప్పటికే మీడియాకు చూపించింది. దాదాపు రూ.7 కోట్లకు పైగా ఖర్చుతో ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ నిర్మించిన ఆ సెట్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.



## చిరును డ్రిల్ మాస్టర్ చేసిన అనిల్ రావిపూడి

అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ సినిమా రూపొందుతున్నది. సంక్రాంతికి వస్తున్నాం మూవీ తర్వాత అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్నా ఈ సినిమాపై ఇప్పటి నుండే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి,సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరు సరసన నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముస్సోరీలో జరుగుతోంది. చిరంజీవి, కేథరీన్ మరియు నయనతార కాంబినేషన్‌లో ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి. అయితే ఈ సినిమాలో మెగాస్టార్ చిరు స్కూల్ లో పిల్లలకు ఆటలు నేర్పించే డ్రిల్ మాస్టర్ పాత్రలో కనిపించబోతున్నాడు. బాలయ్యను కేర్ టేకర్ గా వెంకీ ని కాప్ రోల్ లో చూపించి మెప్పించిన ఈ యంగ్ డైరెక్టర్ ఇప్పుడు చిరును డ్రిల్ మాస్టర్ గా చూపిస్తున్నారు. ఈ సినిమాతో వింటేజ్ చిరు మరోసారి ప్రేక్షకులను అలరిస్తాడని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. మాస్ మ్యూజిక్ స్పెషలిస్ట్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న చిరు అనిల్ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని ఇదివరకే ప్రకటించారు మేకర్స్. అందుకు అనుగుణంగానే షూట్ ను చక చక ఫినిష్ చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న చిరు ? అనిల్ కాంబో ఎంతటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

## మిలిటరీ కథలో సల్మాన్

ఇటీవల 'సికందర్'తో ప్రేక్షకులముందుకొచ్చిన ప్రముఖ బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ తన తదుపరి ప్రాజెక్ట్ కోసం సన్నద్ధమయ్యారు. అపూర్వ లఖియా దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నట్లు తెలుస్తోంది. సల్మాన్ సరసన చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తున్నారు. సైనిక సంఘటనల ఆధారంగా మిలిటరీ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. ఇంకా పేరు ఖరారు చేయని ఈ సినిమా వాస్తవ సంఘటనల నుంచి ప్రేరణ పొందినట్లు సమాచారం. బాలీవుడ్‌లో ఇటీవలే 'హౌస్‌ఫుల్ 5'తో ప్రేక్షకుల్ని అలరించిన చిత్రాంగద తొలిసారి సల్మాన్‌తో తెరని పంచుకోనున్నారు.

## కియారా కోసం యష్ త్యాగం





కేజీఎఫ్' సిరీస్ ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న కన్నడ స్టార్ యష్.. తన కొత్త ప్రాజెక్ట్ 'టాక్సిక్' కోసం మరింత ఆసక్తికరంగా ప్రిపేర్ అవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ఇప్పటికే యష్ బర్త్‌డే స్పెషల్‌గా విడుదలైన గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది.ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ కూడా నటిస్తున్నారు. అయితే చిత్ర షూటింగ్ మొదలైన కొద్దికాలానికే కియారా గర్భవతిగా మారిన విషయం తెలిసిందే.అయితే గర్భవతిగా ఉన్న కియారాకు షూటింగ్ షెడ్యూల్ సులభంగా ఉండాలనే ఉద్దేశంతో, యష్ తన భాగమైన కొన్ని ముఖ్యమైన సన్నివేశాల షూటింగ్‌ను, బెంగళూరులో కాకుండా, ముంబైకి మార్చాలని నిర్ణయించారట. దీంతో ఆమెకు ప్రయాణ బాధ్యత తగ్గింది. ముంబైలోనే యష్, కియారాల మధ్య సన్నివేశాలను, త్వరగా షూట్ చేసి పూర్తి చేశారట. ఈ విషయం బయటకు వచ్చాక, యష్ సెన్సిటివిటీ, సహనభావం చూసిన ప్రేక్షకులు, అభిమానులు ఆయన పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక నటీమణి ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, షూటింగ్ లొకేషన్ మార్చడం నిజంగా అరుదైన విషయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.

## పూరి చిత్రంలో సంయుక్త



సంయుక్తా తెలుగు, హిందీ, తమిళం అని తేడాల్లేకుండా అన్ని భాషల్ని చుట్టేస్తోంది. వరుస సినిమాలతో జోరు చూపిస్తోంది. అయితే ఇప్పుడామె ఖాతాలో మరో పాన్ ఇండియా సినిమా చేరింది. తమిళ కథానాయకుడు విజయ్ సేతుపతి.. దర్శకుడు పూరి జగన్నాథ్ కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. దీన్ని పూరి కనెక్ట్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. సీనియర్ నటి టబు ఓ ప్రధాన పాత్రధారిగా కనిపించనుంది. ఇప్పుడీ బృందంలోకి సంయుక్తా కూడా చేరింది. ఆమె ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నట్లు తెలియజేస్తూ చిత్ర వర్గాలు మంగళవారం సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ప్రకటనని విడుదల చేశాయి."ఆమె నడకలో హుందాతనం.. కళ్లలో ఆగ్రహం" అంటూ తన ఫొటోను పంచుకున్నాయి. ఇదొక పూర్తి స్థాయి మాస్, కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానుంది. విజయ్ ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్న పాత్రలో.. సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. త్వరలో చిత్రీకరణ మొదలు కానున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి 'భిక్షాందేహి' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక సంయుక్త ప్రస్తుతం తెలుగులో 'అఖండ 2: తాండవం', 'స్వయం భూ' చిత్రాల్లో నటిస్తోంది. తమిళంలో లారెన్స్‌తో 'బెంజ్'లో సందడి చేయనుంది. హిందీ, మలయాళంలో ఒక్కో సినిమా చేస్తోంది.

## జూలై 25కు కింగ్‌డమ్ లాక్ అయ్యిందా?

విజయ్ దేవరకొండ కెరీర్‌లో తెరకెక్కుతున్న అత్యంత కీలకమైన చిత్రం 'కింగ్‌డమ్'. తాజా సమాచారం ప్రకారం, 'కింగ్‌డమ్' సినిమా జూలై 25న, శుక్రవారం విడుదల కానుందని ఓ వార్త వైరల్ అవుతుంది. అధికారికంగా ఈ విషయంపై మేకర్స్ ప్రకటించనప్పటికీ, ఆ డేట్‌కే సినిమాను ప్లాన్ చేశారని ప్రచారం సాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. గతంలో లైగర్, ఫ్యామిలీ స్టార్ వంటి ఫ్లాప్స్ కారణంగా.. విజయ్ మార్కెట్ మీద చాలా ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో 'కింగ్‌డమ్' ద్వారా తన కెరీర్‌ను మళ్లీ పైకి తీసుకెళ్లాలన్న నమ్మకంతో విజయ్ అడుగులు వేస్తున్నాడు. ఇక ఈ చిత్రానికి జెర్సీ వంటి హిట్‌ను అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు.విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే ఇది అత్యధిక బడ్జెట్ కలిగిన పాన్ ఇండియా చిత్రం. ఇక ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజయ్ లుక్



అన్నీ కలిసి సినిమాపై పాజిటివ్ బజ్ తెచ్చాయి. అయితే, టీజర్ తర్వాత ఎలాంటి ప్రమోషనల్ మెటీరియల్ విడుదల కాలేదు. పాటలు, ట్రైలర్ లేదా మీడియా ఈవెంట్లపై ఎటువంటి అప్‌డేట్లు లేకపోవడం కొన్ని అనుమానాలు మొదలయ్యాయి. సాధారణంగా ఇలాంటి భారీ చిత్రాలు విడుదలకు రెండు నెలల ముందే సాంగ్స్, ఈవెంట్లు మొదలవుతాయి. కానీ 'కింగ్‌డమ్' మేకర్స్ ఇప్పటికీ ప్రమోషనల్ కార్యక్రమాలపై మౌనమే పాటిస్తున్నారు. ఫ్యాన్స్ మాత్రం చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన కోసం ఆతురతగా ఎదురుచూస్తున్నారు. తన కెరీర్‌ను మళ్లీ నిలబెట్టుకోవాలనుకునే విజయ్ దేవరకొండకు ఈ సినిమా ఎంతో ముఖ్యం. మరి ఏం జరుగుతుందో చూడాలి.